విశాలాంధ్ర
విశాఖపట్నం
ఆదివారం 27, అక్టోబర్, 2024

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై క్విజ్

విశాలాంధ్ర - సింహాచలం : గ్రేటర్ విశాఖ స్థానిక ఎస్.ఎస్.టి.ఎల్, రామనాథ్ సెకండరీ స్కూల్ సంయుక్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ యొక్క జీవితం, వారసత్వంపై 5 - 7 తరగతుల పాఠశాల విద్యార్థుల కోసం ది అహమహామికా క్విజ్ 31వ ఎడిషన్‌ను నిర్వహించాయి. సౌరవ్ మజుందార్ సైంటిస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్‌నాథ్ సెకండరీ స్కూల్ వర్ధమాన విజేతలతో వైజాగ్‌లోని వివిధ పాఠశాలల నుండి మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్.వి రంగరాజన్, మాజీ డైరెక్టర్ ఎస్.ఎస్.టి.ఎల్ ఫౌండర్ అహమహమిక, శ్రీమతి ఇలిన్ అబ్రహం, ఎస్.ఎస్.టి.ఎల్ ప్రథమ మహిళ, డాక్టర్ హెచ్.ఎన్. దాస్, విజేతలను డైరెక్టర్ ఎస్ఎస్‌టిఎల్ అభినందించి సత్కరించారు.

శారదా పీఠంపై సమగ్ర విచారణ జరపాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం దోచిపెట్టిన ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం హర్షణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు అన్నారు. సిపిఐ పెందుర్తి ఏరియా పార్టీ సభ్యులు సర్వసభ్య సమావేశం శనివారం పార్టీ సీనియర్ నాయకుడు వై త్రినాధ్ అధ్యక్షతన సుజాతానగర్ పార్టీ కార్యాలయం భగత్ సింగ్ భవన్ లో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో భీమిలి మండలం కొత్తవలసలో కోట్లాది రూపాయులు విలువ చేసే 15 ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా శారదా పీఠానికి కట్టబెట్టారని, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చెయ్యడాన్ని సిపిఐ స్వాగతిస్తున్నదని తెలిపారు. శారదా పీఠంపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తిరుమలలో స్వరూపానంద స్వామిజీకి ఇచ్చిన స్థలాన్ని రద్దు చేశారని, రాష్టంలో శారదా పీఠానికి ఇచ్చిన భూములన్నీ రద్దు చేయాలని కోరారు. చిన ముషిడివాడలో స్వామీజీ గెడ్డ స్థలం సుమారు వెయ్యి చదరపు గజాలు కలుపుకొని నిర్మాణాలు చేసేంత వరకూ జీవీఎంసీ, రెవిన్యూ అధికారులు పట్టించుకోక పోవడం అన్యాయమని అన్నారు. పెందుర్తి మండలంలో అన్యాక్రాంతమైన విలువైన ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉపయోగించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుండి బర్దన్ నగర్ లో నివసిస్తున్న పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పెందుర్తి ఏరియాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం సిపిఐ పనిచేస్తున్నదని అన్నారు. ఈ సంవత్సరం పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా మరింత పట్టుదలతో ప్రజలలో మమేకమై పనిచేద్దామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సమితి సభ్యుడు వై రాంబాబు, సుజాతనగర్, బర్దన్ నగర్ పార్టీ శాఖల కార్యదర్శులు ఎన్ ఆసిరినాయుడు, ఎ అన్నపూర్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలు లక్ష్యం కావాలి : భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా చేసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో 1.76 లక్షల ఓట్లు వేసి ప్రత్యర్థి కంటే 92,401 ఓట్ల భారీ మెజారిటీ ఇచ్చి భీమిలి ప్రజలు చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో లక్ష మార్కును అందుకుని భీమిలి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని మరోసారి నిరూపించాలన్నారు. నిర్దేశించిన సమయానికంటే ముందుగానే లక్ష్యాన్ని చేరుకోవాలని, దీని కోసం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సభ్యత్వ నమోదు పురోగతిని ప్రతిరోజూ స్వయంగా సమీక్షిస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు సహా నియోజకవర్గంలోని పార్టీ పదవులు కూడా ప్రకటిస్తామని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పార్టీ స్థాపించిన ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం కార్యకర్తలందరూ పునరంకితం కావాలన్నారు. పెన్షన్, హౌసింగ్ వంటి సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజలకు పరిచయం చేసింది టీడీపీయేనని వివరించారు. క్షేత్ర స్థాయి కార్యకర్తల పునాదులపై బలోపేతమైన పార్టీ తమదని, ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. రూ.13 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని గంటా చెప్పారు. ఎన్నికల హామీలను ఒకటొ కటిగా నెరవేరుస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్నామన్నారు. విధ్వంసంతో పాలన మొదలు పెట్టిన జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి జాడ లేకుండా చేశారని విమర్శించారు. తప్పుడు కేసులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును 53 రోజుల పాటు జైల్లో ఉంచినందుకు 11 సీట్లు మాత్రమే ఇచ్చి రాష్ట్ర ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. మొబైల్ ద్వారా గంటా శ్రీనివాసరావు సభ్యత్వాన్ని నమోదు చేసుకుని సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్టీ నాయకులు కోరాడ రాజబాబు, గాదు వెంకటప్పడు, డి.ఎ.ఎన్.రాజు, కె.దామోదరరావు, కోరాడ రమణ, బి.ఆర్.బి.నాయుడు, గాదు అప్పల నాయుడు, తాత్రాజు అప్పారావు, వై.జీవన్ కుమార్, దాసరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, అక్కరమాని వెంకట్రావు, రాజు, చందక అప్పలరాజు, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రెవెన్యూ అధికారిగా భవాని శంకర్

విశాలాంధ్ర - శాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా రెవిన్యూ అధికారి మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గా శ్రీ బి.హెచ్ భవాని శంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ నెల 24 న శ్రీ బి.హెచ్ భవాని శంకర్ ను విశాఖ జిల్లా రెవిన్యూ అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం విశాఖ జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ కె.మోహన్ కుమార్ నుండి భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీ బి.హెచ్ భవాని శంకర్‌కు కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న కె.మోహన్ కుమార్ చిత్తూరు డిఆర్వోగా బదిలీ అయ్యారు.

పైడిరాజుకు కాంస్య పతకం

విశాలాంధ్ర - మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి లో ఎ.ఎన్.ఎమ్.గా విధులు నిర్వహిస్తున్న కనకల పైడిరాజు మలేషియాలో బుకత్ జలీల్ స్టేడియంలో ఈనెల 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరిగిన 36వ మలేషియా ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఇండియా తరుపున పాల్గొని కాంస్య పతకం సాధించారు. పైడిరాజు 800 వందల మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి విశాఖకు గర్వ కారణంగా నిలిచారు. కాగా పైడిరాజు విజయం పట్ల విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ శనివారం తేది26.10.2024 న ప్రత్యేకంగా అభినందించారు.

కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ నియోజక వర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. రేడియేషన్ ఆంకాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి, వారికి వివరించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించి ఏ విధంగా వైద్యం తీసుకోవాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై భయాందోళన చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, మెమోగ్రఫి కేజీహెచ్‌లో అందుబాటులో ఉందని, క్యాన్సర్ 4 స్టేజీలు పట్ల అవగాహన కలిగి వుండాలని అన్నారు. అనంతరం కేజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర క్యాన్సర్ చికిత్స సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేజీ హెచ్ లో మరిన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు, అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే కేజీహెచ్‌లో మూడు ఆర్వో ప్లాంట్‌లు అందుబాటులోకి వచ్చే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారని ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ ప్రిన్సిపాల్ శ్రీ బుచ్చిరాజు, సూపరెంటెంట్ శివానంద, రేడియేషన్ ఆంకాలజీ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి డాక్టర్ పాండురంగ కుమారి, రేడియాలజీ హెచ్‌ఓడి బుజ్జిబాబు, జనసేన పార్టీ టిడిపి బిజెపి నాయకులు శ్రీమతి యజ్ఞ శ్రీ, ప్రభాకర్ రామలక్ష్మి, రూప, మహేంద్ర, వినయ్, శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

28న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : కేంద్ర ప్రభుత్వం ఉక్కు కార్మిక వర్గాన్ని కుదిస్తూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. ఉక్కు కర్మాగారం 100% ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపడుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 1353 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎల్‌ఏంఎం, డబ్ల్యు ఆర్‌ఎం -1, ఎం.ఎం ఎస్.ఎం, ఎస్.టి.ఎం, డబ్ల్యూ ఆర్ ఎం-2, ఎస్.బిఎం విభాగాలకు చెందిన ఏ.ఐ.టియు.సి. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ స్టాటజిక్ సేల్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారం ను అస్థిర పరచాలనే లక్ష్యంతో ఉందని, పోరాటాల ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని అన్నారు. కేంద్రం ఉక్కు కార్మికుల హక్కులకు కూడా భంగం కలిగించే చర్యలను విడనాడాలని, లేనిపక్షంలో కార్మిక ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా సోమవారం ది.28-10-2024 న ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా ధర్నా జరుగుతుందని,ఈ ధర్నాలో ఉక్కు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇంకా ఈ దీక్షల్లో ఏ.ఐ.టి.యు.సి నాయకులు ఏ.మసేన్‌రావు, జె.రామకృష్ణ, డి.దేముడు, ఎన్.మిశ్ర, సీతా రామ రాజు, భాస్కరరావు, డి.రమేష్, వి.ఎస్ఎస్ వర్మరాజు, సన్నీబాబు, అమ్మోరు, కార్మిక నాయకులు గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

అపార్ ఐడి క్రియేషన్‌పై గవర్నమెంట్ టీచర్లకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : పెదగంట్యాడ మండలంలో గవర్నమెంట్ టీచర్లకు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ కే శ్రీనివాస్, కె రమణ జి.అపార్ ఐడి క్రియేషన్స్‌పై సదస్సు నిర్వహించారు. ఈ అపర్ ఐడి ఏ విధంగా క్రియేట్ చేయాలో వివర్ణాత్మకమైన వివరణ ఇచ్చారు. అపార్ ఐడి క్రియేట్ చేయాలంటే అడ్మిషన్ రిజిస్టర్, యు డైస్ ఫ్లస్ మరియు ఆధార్ మూడింటిలో స్టూడెంట్ వివరాలు ఒకే విధంగా ఉండాలి. అలా ఉన్నటువంటి విద్యార్థులకు వెంటనే అపార్ ఐడి జనరేట్ చేసేయవచ్చు. మూడు అంశాల్లో ఒకేలా లేనివారికి మాత్రం సరి చేసిన తర్వాత జనరేట్ చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు ఉడిస్ లోని మార్పుల కోసం డిఈఓ ఆఫీస్ వాళ్లకు మాత్రమే ఎడిట్ ఆప్షన్‌ను వారి లాగిన్‌లో ఇవ్వడం జరిగింది. కానీ త్వరలో అన్ని మండలాలకు ఎమ్ఈఓ లాగిన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కావున మన అడ్మిషన్ రిజిస్టర్‌తో యుడైస్ ఫ్లస్‌లోని వివరాలు మ్యాచ్ కానట్లయితే వాటిని ఎడిట్ చేయటానికి సరైన వివరాలను లిఖిత పూర్వకంగా ఎస్ఓ 3 ఫారం ద్వారా తెలియ లియచేసినచో ఎమ్ఈఓ లాగిన్‌లో వాటిని సరిచేయాలని అడ్మిషన్ రిజిస్టర్‌కు ఆధార్ కార్డులో ఉండే విషయాలకు తేడా ఉన్నట్లయితే ఆ విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి వారిని సచివాలయంలో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారము ఆధార్‌ని మార్చుకుని రావలసిందిగా తెలియజేయాలి. చివరగా ఐడి క్రియేషన్ గురించి ఎక్కువగా ఆందోళన పడద్దని తెలియజేస్తున్నాం. అలానే తొందరపడి ఏదో ఒకటి చేసేద్దామని కూడా ఆలోచించవద్దని .ఇవి తల్లిదండ్రులు సమ్మతి పత్రం ఇచ్చిన తర్వాత మాత్రమే అన్నీ సరిగా ఉన్నప్పుడు జనరేట్ చేయాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో 10 గంటల మండలంలో గల వివిధ పాఠశాలల టీచర్లు హాజరయ్యారు.

పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయుధాల ప్రదర్శన

విశాలాంధ్ర - పీఎం పాలెం : ప్రజల రక్షణకు, సమాజ శ్రేయస్సుకు పోలీసుల పాత్ర కీలకమని డీసీపీ-1 అజిత వేజెండ్ల. ఐ.పీ.ఎస్., అన్నారు. ఏ.సి.పి. ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం పీ.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ-1 అజిత వేజెండ్ల. ఐ.పీ.ఎస్... మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ఎందరో పోలీసులు ప్రాణాలు అర్పించారని,వారిని ఏటా స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం నార్త్ సబ్ డివిజన్ ఏ.సి.పి. ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో పలు విద్యా సంస్థల నుంచి హాజరైన విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై అవగాహన, పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాలు, విధులు విధానాలు, నేర విభాగ పనితీరు,డాగ్ స్క్వాడ్ వివరాలు పనితీరు ఎస్సైలు వివరించారు. ఈకార్యక్రమంలో నార్త్ సబ్ డివిజన్ సీఐలు జి.బాలకృష్ణ, బి.సుధాకర్,సిహెచ్ శ్రీధర్, వాసు నాయుడు, ఎస్.ఐ.లు ఎన్ సునీత, కే.భాస్కర్, జె.వై.డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి

ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి నాగరాజు

విశాలాంధ్ర - విశాఖ : అరుకు ఏ.పీ.ఆర్. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.ప్రవీణ్ కుమార్ అనే విద్యార్థిని స్కూల్‌కి రావడం లేదన్న కారణంతో వైస్ ప్రిన్సిపాల్ అతి కిరాతకంగా విద్యార్థి తలపై కొట్టడంతో ఆ దెబ్బలతో గత ఐదు రోజులుగా నరకం అనుభవించాడని, హాస్పిటల్లో చనిపోయే ముందు తల్లిదండ్రులకు విద్యార్థి విషయం చెప్పాడని ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. కేజీహెచ్ వద్ద ఆయన మాట్లాడుతూ కొట్టిన దెబ్బలకు విద్యార్థి అనారోగ్యానికి గురయ్యాడని అయినప్పటికీ దగ్గరలో ఉన్న ఏ హాస్పిటల్‌కీ తీసుకెళ్ల కుండా, కనీసం తల్లి దండ్రులకు తెలియ పరచకుండా విద్యార్థి చని పోయే స్థితికి రావడంతో హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కి తరలించారన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షమే వైస్ ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం స్పందించి 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజనుల హృదయాలలో నిజమైన 'దేముడు' : సీపీఐ నివాళి

విశాలాంధ్ర - విశాఖ : గిరిజనుల హృదయాలలో నిజమైన దేముడు చింతపల్లి మాజీ శాసన సభ్యుడు కామ్రేడ్ గొడ్డేటి దేముడని సిపిఐ విశాఖ జిల్లా సమితి నివాళు లర్పించింది. దేముడు 9 వ వర్ధంతి సందర్భంగా విశాఖ అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం అయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న దేముడుని పార్టీ గుర్తించి చింతపల్లి నియోజకవర్గం నుండి పోటీలో నిలిపిందని తెలిపారు. మొదటిసారి 1994 లో, రెండోసారి 2004 లో శాసనసభ్యుడుగా విజయం సాధించి గిరిజనులు సమస్యల పరిస్కారానికి శాసనసభలో విశేషంగా కృషి చేశారన్నారు. సిపిఐ ఉమ్మడి విశాఖ జిల్లా సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా నిరంతరం అమాయక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి వారి హృదయాలలో నిజమైన దేముడయ్యాడని కొనియాడారు. కామ్రేడ్ దేముడుకి నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం మన్మధరావు, జీఎస్‌జె అచ్యుతరావు, షేక్ రెహమాన్, జి.కాసులరెడ్డి, నూనెల సూరిబాబు, ఎం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి : సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ : నిత్యావసరాల ధరలపై ఆరిలోవ శివశంకర్ నగర్, దుర్గా నగర్, సిద్ధార్థ నగర్, శివాజీ నగర్, ఎం.ఎం.ఆర్. కాలనీల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. పెరిగే ధరలకు హద్దే లేదా, ఏలే వాడికి బుద్ధే లేదా, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సామాన్య, మధ్య తరగతి ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరలను పెరిగి, ఆర్థికంగా భారాలు పడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు ఏ.దేవుడమ్మ, కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి సీహెచ్.కాసుబాబు, ఏ.రవి, ఏఐవైఎఫ్ నాయకులు కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన ఎన్.ప్రేమ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్చం అందజేశారు. ఆయన విజయనగరం విద్యా శాఖాధికారిగాగా పనిచేస్తూ, జిల్లాకు బదిలీపై వచ్చారు. గతంలో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖలో డిప్యూటీ విద్యాశాఖ అధికారిగా ప్రేమ్ కుమార్ పని చేశారు. ఇక్కడ డీఈవోగా పనిచేస్తున్న ఎన్.చంద్రకళ పల్నాడు డిఎస్ఈవోగా బదిలీ అయ్యారు.

సింహాద్రి నాధుని దర్శించుకున్న విజయనగరం డీఆర్ఓ

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని విజయ నగరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి తమ కుటుంబ సభ్యులతో దర్శించు కున్నారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఆనంద్ కుమార్ పూల మాల వేసి ఘన స్వాగతం పలికారు. స్వామివారి కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని తమ గోత్ర నామాలతో స్వామి వారికి సంకల్పం చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. పిదప ఆయనకు ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీనివాసమూర్తి నేరుగా విజయనగరం వెళ్ళి కలెక్టరేట్‌లో డి.ఆర్.ఓగా భాద్యతలు చేపట్టారు.

నూతన డీఈఓకు జిప్సా అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ జిల్లా నూతన డిఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన యన్. ప్రేమ్ కుమార్ గారికి గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) నాయకులు ఆయన కర్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల పలు సమస్యలు ఆయనతో చర్చించారు. డీఈఓతో పాటు ఇటీవల ఉప విద్యా శాఖాధికారిగా పదవీబాధ్యతలు చేపట్టిన యమ్. రవీంద్రబాబుని కూడా కలిసి అభిందించారు. విద్యార్థులకు సంబందించిన వివరాలు ఆన్లైన్ లో యూ డైస్ ఫ్లస్ ద్వారా త్వరగా నమోదు చేయాలని సూచించారు. ఆయన్ని కలిసిన వారిలో జిప్సా గౌరవ అధ్యక్షులు పాలవలస. భాస్కరరావు, అధ్యక్ష, కోశాధికారులు బి.శ్రీనివాసరావు, యమ్. బాబురావు, ఉపాధ్యక్షులు పి.వాసుదేవరావు, యమ్. సత్యన్నారాయణ, డి.ప్రసాద రావు, గిరి, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సందీప్ పంచకర్ల జన్మదిన వేడుకలు

దేవర శివ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లో ఉచితంగా భోజన పంపిణీ

విశాలాంధ్ర - మధురవాడ : జనసేన భీమిలి నియోజకవర్గ ఇంఛార్జ్ సందీప్ పంచకర్ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 5వ వార్డు జనసేన అధ్యక్షులు దేవర శివ ఆధ్వర్యంలో శనివారం రాజీవ్‌గృహకల్ప సమీపంలో గల అన్న క్యాంటీన్లో మూడు పూటలా ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సందీప్ హాజరై అన్న క్యాంటీన్లో భోజనాలను పేదలకు పంపిణీ చేశారు. అనంతరం 5వ వార్డు జనసేన కమిటీ ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా మీ అందరి సమక్షంలో జరుపుకోవడం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. మీ ప్రేమ, ఆదరాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటనన్నారు. ఇంత ఘనంగా ఏర్పాటు చేయడం సంతోషమని ఈ సందర్భంగా దేవర శివను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి నాయకులు శాఖరి శ్రీనుబాబు, ఆరో వార్డు జనసేన అధ్యక్షులు సంతోష్ నాయుడు, ఏడో వార్డు జనసేన అధ్యక్షులు నాగోతి నరసింహనాయుడు, సూరిబాబు, ఎర్రయ్య, సింహాచలం నాయుడు, బత్తిన శివ, ఆదినారాయణ, సునీల్, నారాయణరావు, రవికుమార్, అప్పారావు, వెంకటరమణ, మోహన్, శ్రీను, వినోద్, గణేష్, సురేష్, లక్ష్మణ్, శర్మ, జగదీష్, ఆనంద్, మహింద్ర, భాను తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బాణ సంచా దుకానానికి కూడా సిఫారసు చేయలేదు

- ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తాను..
- డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ నగరంలో ఎక్కడ కూడా ఒక్క బాణాసంచా దుకాణం కోసం తాను సిఫారసు చేయలేదు అని జీ వీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ స్పష్టం చేశారు. ఈ మేరకు 22 వార్డు జన సేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేసిన ఆరోపణలు అవాస్తవం అని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లో వున్న వారు ఆధారాలు లేకుండా ఎదుటి వ్యక్తుల మీద ఆరోపణలు చేయడం సరికాదు అని హితవు పలికారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తే కోర్టు ద్వారా పరువు నష్టం దావా వేస్తాను అని హెచ్చరించారు.

ఫుడ్ కోర్టు ప్రక్షాళన చేయాలి...

అలాగే, నగరంలోని పాత జైలు రోడ్డు వీఎంఆర్ డిఎ సెంట్రల్ పార్కు వద్ద గల ఫుడ్ కోర్టు ను ప్రక్షాళన చేయాలని మొదటి నుంచి తానే పలు కౌన్సిల్ సమావేశాల్లో డిమాండ్ చేశాను అన్నారు. తాను ప్రస్తుతం ఫుడ్ కమిటీ చైర్మన్‌గా కూడా వున్నాను అని గుర్తు చేశారు. ప్రస్తుతం దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యేగా జన సేన పార్టీ నేత వంశీ కృష్ణ శ్రీనివాస్ వున్నారు కదా అని పేర్కొన్నారు. అక్కడ 120 నుంచి 160 దుకాణాలు వున్నాయి అని తెలిపారు. అక్కడ దందా చేస్తున్నది జన సేన పార్టీ నాయకులే అన్నారు. వీరిని తొలగించి అర్హులైన వారికి దుకాణాలు ఇవ్వాలని తాను కూడా సిఫారసు చేశాను అన్నారు. పాత వారిలో ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అన్నది జీవీఎంసీ అధికారులు మాత్రమే తేల్చాల్సిన విషయం అని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తాను ఇప్పటికే పలుమార్లు మేయర్ గోలగాని హరి వెంకట కుమారీ, గత కమిషనర్‌కు కోరానని ఆయన గుర్తు చేశారు. ఫుడ్ కోర్టు దుకాణాలు ద్వారా జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది అని ఆయన అభిప్రాయ పడ్డారు.

కుటుంబ వారసత్వ ఆస్తిలో సమాన హక్కులు పొందలేకపోతున్న కుమార్తెలు

దేశవ్యాప్తంగా సన్ ఫీస్ట్ నిర్వహించిన సర్వేలో వెల్లడి

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశంలో కుమారుల వలె కుమార్తెలకు కూడా కుటుంబ వారసత్వ ఆస్తిని పొందేందుకు సమాన హక్కులు ఉన్నప్పటికీ, వాస్తవానికి ఇది సత్య దూరంగానే ఉంటుందని, కేవలం ఏడు శాతం కుమార్తెలు మాత్రమే ఆ వారసత్వ హక్కులు పొందుతున్నారని సన్‌ఫీస్ట్ సర్వే వెల్లడించింది. ఈ మేరకు విల్ ఆఫ్ చేంజ్' ప్రచారం ద్వారా చేసే కార్యక్రమంలో భాగంగా సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ పరిశోధన నిర్వహించింది. ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ బిస్కెట్స్ కేక్స్ క్లస్టర్ ఆఫీసర్ అలీ హారిస్షేరీ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం 7 శాతం కుమార్తెలు మాత్రమే వీలునామా ద్వారా సమాన వారసత్వాన్ని పొందుతున్నారని తమ అధ్యయనములో తేలింది అన్నారు.

జన్మదినోత్సవం పర్వదినాన అనాధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం : భీమిలి జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ పంచకర్ల సందీప్ పుట్టినరోజు సందర్భంగా గొల్లల తాళ్లవలస భరోసా లిటిల్ హార్ట్స్ బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్న పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. మండల నాయకులు జాన కృష్ణ మాట్లాడుతూ యంగ్ డైనమిక్ లీడర్ పార్టీ కోసం ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులు పవన్ కళ్యాణ్ అత్యధికంగా అభిమానించే సేవకుడు జనసేన పార్టీ భీమిలి ఇంచార్జ్ డాక్టర్ పంచకర్ల పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో ఉన్న పిల్లలకు భోజనం ఏర్పాటు చేసి వారి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపు కోవడం చాలా సంతోషకరంగా ఉందని ఆయన తెలియజేశారు. అనంతరం పంచకర్ల సందీప్ మాట్లాడుతూ నా జన్మదినం పురస్కరించుకొని ఇంత ఘనంగా నిర్వహించినందుకు మండలంలో ఉన్న ప్రతి ఒక్క జన సైనికులకి నా అభినందనలు తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీను బాబు, కృష్ణయ్య, మండల నాయకులు గోవింద్, ప్రశాంత్ ఆల్తి రాజు, నర్సింగ్, తాళ్లవలస జనసైనికులు పాల్గొన్నారు.

పోషకాలు కలిగిన బాదం ఎంపిక చేసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం : మనం ప్రతిరోజు తీసుకునే ఆహారంలో బాదం లాంటి పోషకాహారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు ఆహార రంగ నిపుణులు వ్యాఖ్యానించారు. బాదం తరహా గింజలు ఆరోగ్యానికి అంతా మంచివన్నారు. బాదంపప్పులో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ ఫైబర్ మరియు మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయన్నారు. .ప్రతి రోజూ ఒక గుప్పెడు బాదంపప్పులను తీసుకోవడం వల్ల అవి కార్బోహైడ్రేట్ ఆహారాల ప్రభావాన్ని తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయని, ఈ గింజలలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంది, ఇది చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహించే యాంటీ ఏజింగ్ లక్షణాలకు ప్రసిద్ధి. వాస్తవానికి, ఆయుర్వేదం, సిద్ధ మరియు యునాని గ్రంథాలు చర్మకాంతిని పెంచడంలో బాదం యొక్క పాత్రను హైలైట్ చేశాయన్నారు.

ప్రభుత్వ ఛాతీ, మానసిక ఆసుపత్రులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు అందించే వైద్య సేవలు మరింతగా మెరుగు పరిచేందుకు వైద్యులు కృషి చేయాలని రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన నగరంలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి, మానసిక ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ముందుగా ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి చెక్ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌళిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ మానసిక ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను, రోగులకు అందుతున్న చికిత్స పద్ధతులను పరిశీలించి వార్డుల్లో రోగులతో మాట్లాడి తన సంతృప్తిని వెళ్లబుచ్చారు. వలు వార్డులను తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకులు, వివిధ విభాగాల వైద్యాధికారులలకు తగు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఆయన వెంట మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి, హెచ్.ఓ.డి డా.డి. విజయలక్ష్మి, పర్యవేక్షణ అధికారి డాక్టర్ తులసీధర్ రెడ్డి, ఛాతీ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ సునీల్ కుమార్ , ఆయా ఆసుపత్రుల వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

ఎస్ఎన్ పాల్‌కి, గుడివాడ అమర్నాథ్‌కు అవినాభావ సంబంధం

మాజీ మంత్రి గుడివాడ అమర్ వైఖరిపై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విమర్శలు

విశాలాంధ్ర : విశాఖ సిటీ : ఎస్ఎన్‌పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) కి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు అవినాభావ సంబంధం ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు శారదా పీఠం చుట్టూ తిరిగి ఎస్.ఎన్.పాల్ కు సాష్టాంగ నమస్కారాలు చేసిన కోడిగుడ్ల శాఖ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తో పాటు ఇతర మాజీ మంత్రులు, వైసిపి శ్రేణులు.. ఇప్పుడు ఎస్.ఎన్.పాల్ కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వైసీపీ మేధావుల మౌనం అప్పటి 'రాజు గురువు' ఎస్.ఎన్.పాల్ తప్పిదాలకు పాల్పడినట్టుగానే నిర్ధారిస్తోందన్నారు. ఎకరా 20 కోట్ల రూపాయలు విలువ చేసే భూమి ని కేవలం లక్ష రూపాయలు చొప్పున 15 ఎకరాలు ఎలా ముట్ట చెప్పారని ప్రశ్నించారు. ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఆ భూమిని ఉపయోగించుకుంటానని చెప్పి ఆ తర్వాత కమర్షియల్ వినియోగానికి ఊరుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం అసలు గుర్తింపే లేని శారదా పీఠానికి అధిపతి అని చెప్పుకుంటున్న ఎస్.ఎన్.పాల్ నుంచి ఆ 15 ఎకరాలను ప్రభుత్వ వెనక్కి తీసుకుందన్నారు. విలేకరుల సమావేశంలో వి.పూర్ణచంద్రరావు, కే.మహేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులు 30 లక్షలతో 3 మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలోవెల్లంకి పంచాయతీ లో దివీస్ సంస్థ సి.ఎస్.ఆర్ నిధులు సుమారు రూ"30 లక్షలు వెచ్చించి 3 మినరల్ ప్లాంట్లను ఏర్పాటు చేసారు. పంచాయతీ పరిధిలోని బొడ్డపాలెం వై.ఎస్.ఆర్. కాలనీ, వెల్లంకి కళ్యాణమండపం వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను దివీస్ ఎండి ఎం. ఎస్. రావు, సి ఎస్ ఆర్ మేనేజర్ దేవుళ్ళ సురేష్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్లంకి గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు మండలం వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు సాధారణ త్రాగు నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడకుండా శుద్ధి చేసిన నీటిని వినియోగిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ జి.ఎ.వి.శ్రీ రామ మూర్తి మాట్లాడుతూ పంచాయతీ పెద్దలు కోరిన వెంటనే దివీస్ వారు స్పందించి ఏర్పాటు చేసిన ఈ ఆధునిక శుద్ధి నీటి ప్లాంట్లను అందరూ భాధ్యతగా కాపాడుకుంటూ నీటినీ వియోగించుకునే విధంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎం. పి. టీ. సీ. వడాల అప్పలనాయుడు , ఉప సర్పంచ్ కంచరావు శ్రీను, నాయకులు కాకర వెంకటరమణ, మాజీ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ పిన్నింటి వెంకట రమణ, పార్టీ ప్రెసిడెంట్ ముత్యలరెడ్డి, నాయకులు వై. ప్రసాద్, జి.గోవింద్ , మాజి ఎం.పి.టీ.సీ. వడాల రాము, బుల్లిరెడ్డి, అప్పలరెడ్డి కూటమి నాయకులు మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మలబార్‌లో 'మైన్' డైమండ్ షో ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రపంచంలో అతి పెద్ద జ్యూవెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్ డైమండ్స్ తమ విశాఖపట్నం షోరూంలో "మైన్ డైమండ్స్" షోని ప్రారం భించింది. మలబార్ గోల్డ్ డైమండ్స్ తమ విశాఖపట్నం షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు మరియు ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నారు. మలబార్ గోల్డ్ డైమండ్స్ విశాఖపట్నం షోరూంలో 26 అక్టోబర్ నుండి 03 నవంబర్ 2024 వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుంది అని షోరూం హెడ్ ఫెబిన్ తెలియజెసారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 10 శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చునని చెప్పారు.

కనమాంలో మంచినీటి ట్యాంక్ నిర్మాణం కొరకు శంకుస్థాపన

రూ.41 లక్షల నిధులతో పనులకు శ్రీకారం

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో కనమాం పంచాయతీ పరిధిలో గోరింట, గొల్లల కనమాం, ప్రభుత్వ కాలనీ గ్రామాలకు త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉంది త్రాగునీటి నిమిత్తం అప్పట్లో డిసెంబర్ 2022 ,41 లక్షల రూపాయలు నిధులు మంజూరైనప్పటికీ జలజీవన్ మిషన్ పనులు ఆలస్యం అయ్యాయి కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ఈరోజు పంచాయతీ నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఏదేమైనా సరే పార్టీలకు అతీతంగా పంచాయతీ లో పనులు మొదలుపెట్టడం సంతోషంగా ఉందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పల రాము, పిలిసెట్టి సింహాచలం నాయుడు, ఎర్ర రాము, ఎంపీటీసీ కృష్ణ, పళ్ళ రమణ, పంచాయతీ కార్యదర్శి ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో సిఐటియు కార్యాలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలంలో గ్రంథాలయం ఎదురుగా ప్రధాని రహదారికు అనుకుని సిఐటియు కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు సిఐటియు స్థానిక నేత భీమిలి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్. ఎస్ .ఎన్ మూర్తి తెలియజేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కే లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎం. జగ్గు నాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, జీవీఎంసీ 78 వ వార్డు కార్పొరేటర్ కామ్రేడ్ దా " బి. గంగారావు, కామ్రేడ్స్ సింగిడి రాము ,మలపర్తి అప్పారావు, తదితర నేతలు హాజరవుతారని తెలియజేశారు. పద్మనాభం మండ లంలో సిఐటియు కార్యాలయం ఏర్పాటు చేయడం వలన స్థానిక బడుగు బలహీన వర్గాలు, కార్మిక కర్షక వర్గాలకు, అనగారిన వర్గాలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని, స్థానికంగా అందుబాటులో ఉంటుందని భీమిలి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తెలియజేశారు.

జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా సందీప్ బర్తడే వేడుకలు

విశాలాంధ్ర సాగర్ నగర్ : జనసేన పార్టీ భీమిలి ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల జన్మదిన వేడుకలను ఎండాడ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, జీవీఎంసీ వార్డు నాయకులు అందరు సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు ఈ సందర్భంగా గత పది సంవత్సరాల నుండి జనసేన పార్టీకి సందీప్ చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల జీవీఎంసీ తదితర నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర కళింగ కోమటి సంఘం కార్యదర్శిగా కోరాడ

విశాలాంధ్ర - మల్కాపురం : రాష్ట్ర కళింగ కోమటి సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకోగా ప్రమాణ స్వీకారం ఆదివారం శ్రీకాకుళంలో నిర్వ హిం చేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టమని రాష్ట్ర కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారని రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజు తెలిపారు. ఆదివారం ప్రమాణస్వీకారం శ్రీకాకుళంలోని రైస్ మిల్లర్ల భవనంలో జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని సూచించారు. కళింగ వైశ్య సంఘం అభివృద్ధి ఇతర ప్రధాన అంశాలపై చర్చించి యువతకు అన్ని రంగాల్లో ఆదుకునేలా సంఘం ముందుంటుందని ఈ మేరకు అన్ని జిల్లాల్లో గుర్తింపు చేపడతామని తెలిపారు.

అక్రమ వసూలు కోసం... దీపావళి దుకాణాలు

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపణలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖ మహానగర పాలక సంస్థ గౌరవ మేయర్ పీఠంలోని వ్యక్తి, డిప్యూటీ మేయర్‌గా ఉన్న వ్యక్తులు దీపావళి బాణాసంచా దుకాణాల నుంచి దుకాణానికి లక్ష రూపాయలు చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శనివారం హోటల్ మేఘాల యలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్ అక్రమాలపై ఆయన మాట్లాడారు. ఇది నేను చెప్తుతున్నది కాదని, 3 టౌన్ పోలీస్ స్టేషన్లో పోలీసులు విచారించి, ఎఫ్ఐఆర్ 194/2024,సెక్షన్ 420, 323,506 384 రెడ్ విత్ 34 పెట్టారని వివరణ ఇచ్చారు. కేసుగట్టిన ఎఫ్ ఐ ఆర్ కాఫీ చూస్తే వాస్తవాలు అన్ని బయటకు వస్తాయన్నారు. స్వయంగా మేయర్ హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జీయ్యని శ్రీధర్ లక్షల రూపాయలు మోసం చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. జైల్ రోడ్ లో నైట్ ఫుడ్ కోర్ట్ లో దుకాణాలకు వసూలు చేశారని విమర్శించారు. జి20 సదస్సు పెట్టినప్పుడు డిజిటల్ అడ్వర్టైజ్మెంట్ బోర్డులో వాటాలు పంచుకున్నారన్నారు. ఇప్పుడు దీపావళికి మధ్యతరగతి కుటుంబీకులు దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా అమ్ముకుని డబ్బులు మిగిలితే పండగ చేసుకుందామని అనుకున్నా.. ఆనందాన్ని మిగల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాల్లో ఉండి ఈ రకంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసిన హరి వెంకట కుమారి, జియ్యని శ్రీధర్‌లు పూర్తి విచారణ చేయించుకోవాలన్నారు. లేదంటే ఆ పదవికి రాజీనామా చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి అవినీతి తిమింగలం అయితే...ఆయన వెంట ఉన్న ఈ మేయర్, డిప్యూటీ మేయర్లు ఎలా ఉంటారనేది ఈ ఉదంతాలతో వెల్లడవుతోందన్నారు. నన్ను బ్లాక్ మెయిలర్ అని విమర్శలు చేసిన జియాని శ్రీధర్ ఇప్పుడు ఏ సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కాపీలో పేరు కూడా ఉందని, దీనిపై పోలీస్ కమిషనర్, పోలీసులు పూర్తి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర నిఘా విభాగం దృష్టి పెట్టాలని కోరారు. ఈ వ్యవహారం మీద మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేస్తానన్నారు.

నౌసనబాద్ కె.వి.1 పాఠశాలలో ద్వితీయ స్పాన్ పరీక్షలు

విశాలాంధ్ర - మల్కాపురం : నౌసనబాద్ కె.వి.1 పాఠశాలలో ద్వితీయ స్పాన్ పరీక్షలు శనివారం కె.వి హైదరాబాద్ సంగట్ పరిధిలో ఉన్న 23 పాఠశాలకు సంబంధించి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 180 మంది పాల్గొనడం జరిగింది. కేవి 1 ప్రధానోపాధ్యాయులు సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో కె.వి ఏఎస్‌టిఓ అధికారిని జ్యోతి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ క్రైమ్ బ్రాంచ్ డిసిపి లతా మాధురి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్నిట్లో రాణించాలని అన్నారు ఈ సందర్భంగా పరివేక్షణ మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షలు మూడు రోజులపాటు జరుపుకోవడం జరుగుతుందని సోమవారం తుది నిర్ణయం జరుగుతుందని తెలిపారు. మెదటి రోజు సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా కెవి పాఠశాల అధ్యాపకురాలు గజలక్ష్మి, జయశ్రీ, బిందు, సాహిత్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కె.వి పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి

మాజీ ఎంఈఓ పద్మావతి... ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

విశాలాంధ్ర - అనందపురం : మండలంలోని పలు హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికలపై రిటైర్డ్ ఎంఈఓ ఎస్ ఎస్ పద్మావతి ప్రచారం చేపట్టారు. ఆనందపురం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 2025 జరగబోయే ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పోటీ చేయబోతున్నామమ్మారు. 1998 డీఎస్సీ లో సెలెక్ట్ అయ్యి 20 సంవత్సరాలు స్కూల్ అసిస్టెంట్ గాను, పది సంవత్సరాలు ప్రధాన ఉపాధ్యాయులు గాను, ఆరు సంవత్సరాలు మండల విద్యాశాఖ అధికారి గాను పనిచేసి 2024 జులైలో రిటైర్డ్ అయ్యానన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనందపురం ప్రధానోపాధ్యాయులు కె రామకృష్ణ పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు చేతిలో షర్మిల కీలుబొమ్మ : వరుదు కళ్యాణి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : షర్మిల మాటలు వైఎస్ఆర్ కుమార్తే మాటల్లా లేవని, చంద్రబాబు చేతిలో కీలు బొమ్మలా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ వైసీపీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి అన్నారు. శనివారం సాయంత్రం వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొంత అన్న అనే అనుబంధం లేకుండా షర్మిల మాట్లాడు తున్నారని, షర్మిల మాటలు వింటుంటే ఈమె వైఎస్ఆర్ కుమార్తె నా అనేలా ఉందన్నారు. చంద్రబాబుతో కలిసి షర్మిల చేసే కుట్రలు చూసి స్వర్గంలో వైఎస్ఆర్ కూడా బాధపడతారన్నారు. షర్మిలలో అడుగడుగునా స్వార్ధం కని పిస్తుందని, చంద్రబాబు అడుగు జాడల్లో షర్మిల నడుస్తున్నారని, ఈడీ కేసుల్లో భారతి ఆస్తులు కూడా జప్తు చేశారని, నాడు కేసుల్లో వైఎస్ఆర్ పేరును కాంగ్రెస్ పార్టీ పెట్టింది నాడు పొన్నవోలు సుధాకర్ రెడ్డి ద్వారా పోరాడి వైఎస్ఆర్ పేరును తొలగించారన్నారు. తప్పుడు మార్గంలో షేర్లు బదిలీ చేశారని జగన్ కోర్టుకు వెళ్ళారని, షర్మిల అండ్ కో చేసే కీడు నుంచి తప్పించుకోడానికి మాత్రమే జగన్ కోర్టుకు వెళ్లారన్నారు. జగన్ బెయిల్ రద్దు అయితే లక్షల కుటుంబాలు రోడ్డున పడేవి సొంత అన్న కోసం ఇంత దారుణంగా ఎవరైనా మాట్లాడుతారా రక్తం పంచుకొని పుట్టిన అన్న కోసం ఇలా మాట్లా డటం దుర్మార్గం మహిళలను గొప్పగా చూసే వ్యక్తి వైఎస్ జగన్ అని అన్నారు.

ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా పని చేస్తాం : ఎంపీ శ్రీభరత్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మరియు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన చర్చలో ఆంధ్రప్రదేశ్ ఉపాధి విధానాలు ఆర్థికాభివృద్ధి పై జరిగిన కీలక చర్చలో ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఆరు విధానాలు మరియు కార్పొరేట్ల ప్రధాన పెట్టుబడుల ప్రకటనలను సభ్యులు అభినందించగా, ఇంకా పెండింగ్ ఉన్న ప్రోత్సాహకాల విడుదల, విశాఖలో ప్రతిభావంతుల సంఖ్యను పెంచడం, ఎక్సైజ్, ఆదాయ, పన్ను చట్టాలను సవరణ చేయడం వంటి అంశాల్లో మరింత ఆర్థిక సహకారం అవసరమని ఆయన అన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధి మరియు పరిశ్రమల ప్రోత్సాహం తమ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ప్రభుత్వ, పరిశ్రమ మధ్య మరింత నిర్మాణాత్మక సహకారానికి ప్రోత్సాహం ఇచ్చి, లక్ష్యానికి అనుగుణంగా మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ చెంబర్స్ బోర్డు ప్రెసిడెంట్ దమ్మిడి సత్యనారాయణ రావు, ఏపీ ఎంఎస్ఎంఈ బోర్డు చైర్మన్ డీ. శివశంకర రావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 పాయింట్ ప్రోగ్రాం గుడ్ గవర్నెన్స్ చైర్మన్ లంక దినకర్, గ్రావిట్ షిప్పింగ్ ఎండి సాంబశివరావు పాల్గొన్నారు.

తొలి రోజు ఇన్నింగ్స్‌లో 295 పరుగులు చేసిన ఆంధ్ర

అద్భుతంగా ఆంధ్ర, హిమాచల్ రంజీ మ్యాచ్

విశాలాంధ్ర - పీఎంపాలేం : ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ గ్రూప్ బి రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో తొలి ఇన్నింగ్స్ మ్యాచ్ ఘనంగా ప్రారంభమయ్యింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచి హిమాచల్ ప్రదేశ్ బౌలింగ్ ఎన్నుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు ఇన్నింగ్స్ లో గడిచిన 80 ఓవర్లకు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. ముందుగా దిగిన ఓపెనర్ బ్యాట్మెన్లు అంతగా రాణించలేక తక్కువ పరుగులకే వికెట్ల కోల్పోయారు. మిడిల్ ఆర్డర్లో దిగిన కెప్టెన్ ఎస్.కె రషీద్ 132 బంతుల్లో 9 ఫోర్లుతో 69 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. జి హనుమ విహారి కూడా అద్భుతంగా రాణించి 115 బంతుల్లో 12 ఫోర్లతో 66 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత దిగిన భారత క్రికెటర్ కె.ఎస్.భరత్ తన సొంత గడ్డపై విరిచిత ఆట తీరును ప్రదర్శించాడు. వన్డే తరహాలో కేవలం 39 బంతుల్లో 8 ఫోర్లు 3 సిక్స్‌లతో 65 పరుగులు చేసి దిగిన ముగ్గురు బ్యాట్మెన్లు కూడా అర్థ సెంచరీలు పూర్తి చేసి స్కోర్ ను ముందుకు నడిపించారు. తర్వాత దిగిన జి. మనీష్ 31, టి. విజయ్ లు 21 పరుగులు చేసి తొలి రోజు ఇన్నింగ్స్ ముగిసేసరికి నాటౌట్ గా బరిలో నిలిచారు. దీనితో ఆంధ్ర జట్టు తొలి రోజు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు నష్టపోయింది.

బౌలింగ్ బరిలో హిమాచల్ ప్రదేశ్...

బౌలింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ దివేష్ ఆర్ శర్మ, కెప్టెన్ రిషి ఆర్ దావన్ లు తలోక రెండు వికెట్లు చొప్పున తీసుకున్నారు. అలాగే అర్పిత్,ముకుల్ లు తలోఒకటి వికెట్లు చొప్పున కైవసం చేసుకున్నారు.

ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజీ విశాఖ డివిజన్ రివ్యూ

విశాలాంధ్ర - కలెక్టరేట్ : విశాఖ పర్యటనలో భాగంగా తొలుత "ఎక్స్ ప్లోర్ న్యూ ఆపర్చునిటీస్ అండ్ కొలాబరేట్ ఆన్ ఇన్వెస్ట్మెంట్ పాలసీస్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్" సెమినార్ లో ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజీ పాల్గొని ప్రసంగించారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్, విశాఖ డెవలప్మెంట్ కౌన్సిల్ మరియు టూర్స్ అండ్ ట్రావెల్స్ ఈ సెమినార్లో పాల్గొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన వల్ల పర్యాటక రంగం పడకేసిందని, ప్రస్తుతం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చొరవతో తిరిగి పుంజుకుంటుందని, ఇటీవల పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి గౌరవ ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యమిస్తారని వారి దర్శనికతను అమలు చేయటమే తమ ప్రధాన కర్తవ్యమని అన్నారు. అనంతరం చైర్మన్ విశాఖపట్నం డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పునరుద్ధరణ పనులపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ బీచ్ రోడ్ లో ఉన్న అప్పు ఘర్ టూరిజం హోటల్ పునరుద్ధరణ పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష లో విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్ మరియు డివిజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్, ఏ పి టి డి సి బోర్డ్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌ను వినియోగించండి

రైతులు ఆవేదన

నిరంతర రద్దీకి కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

అధికారులు పునరా ఆలోచన చేయండి...

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం జంక్షన్ లో ఉన్న లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి మార్కెట్ దీర్ఘకాలంగా నిరుపయోగంగా మారి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. ప్రస్తుత మార్కెట్ కి వచ్చే రైతులు వాహనాలు రద్దీ దృష్ట్యా ఉన్న వేములవలస మహాత్మా గాంధీ పువ్వుల మార్కెట్ రోజు రోజుకి జనాలతో కిక్కిరిసిపోతుంది. అందువల్ల తరచూ ఉదయం వేళలో పాఠశాల బస్సులు, మార్కెట్కు వచ్చే రైతులు మిగతా వాహనాలతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడి గంటల కొద్ది ట్రాఫిక్ లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దాంతో దాంతోపాటు మార్కెట్ చిన్నది అయినందున మార్కెట్లో స్థానం లేక కొంతమంది చిన్న చిన్న వ్యాపారస్తులు రోడ్డుపైనే వారి యొక్క వ్యాపారం సాగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు అయితే ఈ ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది వారు శ్రమించినప్పటికీ కూడా కొంతమేర మాత్రమే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది. అలాగే విశాఖపట్నం నుంచి వస్తున్న వాహనాలు ఆనందపురం మార్కెట్ వైపు అతివేగంగా రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు . ప్రస్తుతం కొంతమేర ట్రాఫిక్ సమస్యను పరిష్కారం కావాలంటే పువ్వులు మార్కెట్ తో పాటు ఎల్.వి పాలెం లో ఉన్న మార్కెట్ యార్డ్ ని కూడా ఉపయోగించుకున్నట్లయితే మార్కెట్ అభివృద్ధి అలాగే రోడ్డుపై చిరు వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులకు కొంతమేర ఉపశమనం కలిగిస్తుందని మార్కెట్ కు వచ్చే రైతులు వాపోతున్నారు. ఈ మార్కెట్ యార్డ్ గురించి పలుమార్లు స్థానిక నాయకులు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ను ఉపయోగించమని ప్రాధేయపడినప్పటికీ కూడా సంబంధిత అధికారులు ఎటువంటి చలనం లేదు. వ్యాపారస్తులు క్రయవిక్రయాలకు ఈ రెండో మార్కెట్ను ఉపయోగించినట్లయితే వ్యాపారాలతో పాటు కొంత మందికి మార్కెట్లో ఉపాధి అవకాశాలు కలుగుతాయని స్థానిక నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.